




టీడీపీ కార్యాలయం వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



నవులూరు గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు

రాజధాని పనులకు సహకరించాలి

- నవులూరు, వెంకటపాలెం గ్రామసభల్లో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

మంగళగిరి, తుళ్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులకు భూములిచ్చిన రైతులు సహకరించాలని సీఆర్డీఏ కమిషనర్ కే.కన్నబాబు తెలిపారు. మంగళగిరి, తుళ్లూరు మండలాల పరిధిలోని నవులూరు, వెంకటపాలెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో కమిషనర్ పాల్గొని ప్రసంగించారు. తక్షణ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించి, మిగిలిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగా మౌలికవసతుల కల్పనకు చేపడుతున్న కార్యకలాపాలను గ్రామస్థులకు కమిషనర్ తెలిపారు. ఆయా గ్రామాల అభివృద్ధికి సీఆర్డీఏ తీసుకోవాల్సిన చర్యలను రైతులు వివరించారు. భూ సమీకరణ, నెగోషియేటెడ్ సెటి ల్మెంట్ (ఎన్ఎస్పీ), భూ సేకరణ, 22 ఏ భూముల సమస్యల ను రైతులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. తమ గ్రామం లో ప్రతిష్ఠాత్మక సంస్థలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను నవులూరు రైతులు కోరారు. భూసమీకరణ ప్రక్రియలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంకటపాలెంలో జరి గిన సభలో రైతులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామ సభల్లో అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ, క్యాపిటల్ సిటీ ల్యాండ్స్ డైరెక్టర్ వసంతరాయుడు, సీఆర్డీఏ అధికారులు సురేశ్‌కుమార్, పీ.రాములు, జీ.భీమారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.ఎస్.భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్ సందర్శనకు గవర్నర్

రూ.1.32 కోట్ల.. బయోస్టిమ్యులెంట్స్

అమ్మకాలు నిలిపివేత

'మెలియాయిడోసిస్'కు మెరుగైన వైద్యం 8లో

కామాంధుడిని పట్టించిన సిమ్

రైల్లో అత్యాచారం కేసులో పోలీసులకు చిక్కిన నిందితుడు

బాధిత మహిళ సిమ్ తన ఫోనులో వేసుకుని దొరికాడు 2లో



ఖరీఫ్..కళకళ


3 జిల్లాల్లో.. 9.56 లక్షల ఎకరాలు

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 9.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. పల్నాడు జిల్లాలో లక్ష్యాలను మించి రైతులు పంటలు సాగు చేశారు. పల్నాడులో సాగు విస్తీర్ణం 117 శాతంగా నమో దైంది. వ్యవసాయ ఉత్పత్తులపైనే జిల్లా జీడీపీ ఆధారపడి ఉంది. పంటల సాగు విస్తీర్ణం పెరగడం తో జిల్లాల వృద్ధి రేటు కూడా గణనీయంగా పెరుగుతుందని అంచనా.

విస్తారంగా.. వరి

ఈ ఏడాది సాగు నీరు గతంలో కంటే ముందస్తుగానే సరఫరా చేశారు. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వరి సాగు విస్తృతంగా జరిగింది. గత నాలుగేళ్ల కంటే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా పెరిగింది. మూడు జిల్లాల్లో 5,53,475 ఎకరాల్లో వరి సాగు చేశారు. పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం కంటే వరి 46 శాతం పెరిగిందని వ్యవసాయ శాఖ పేర్కొంది. బాపట్ల జిల్లాలో నాలుగు, గుంటూరు జిల్లాలో ఒక శాతం పెరిగింది.

పత్తి



- అంచనాలకు మించి సాగు
- 9.56 లక్షల ఎకరాల్లో పంటలు
- పెరిగిన వరి, పత్తి, కంది విస్తీర్ణం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఆశాజనకంగా వర్షాలు.. జలకళతో జలాశయాలు, చెరువులు.. రైతుల్లో ఉత్సాహంతో ఖరీఫ్ సాగు కళకళలాడుతోంది. అంచనాలకు మించి రైతులు పంటల సాగును విస్తృతంగా చేపట్టారు. రికార్డు స్థాయిలో వరి, పత్తి, కంది పంటల సాగవుతున్నాయి. సాగు ఆరంభంలో వర్షాభావం నెలకొన్నా తదుపరి భారీగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు ఉత్సాహంగా పంటల సాగు చేపట్టారు.

పల్నాడు జిల్లాలో..

పల్నాడు జిల్లాలో పంటల సాగు లక్ష్యం 4,53 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అయితే సాగు సాధారణ విస్తీర్ణం 3,89,017 ఎకరాలు కాగా 4,56,563 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. లక్ష్యాలను మించి రైతులు పంటలు సాగు చేశారు. వరి సాగు సాధారణ విస్తీర్ణం 96,497 ఎకరాలు కాగా 1,40,643 ఎకరాల్లో సాగు జరిగింది. వరి సాగు 146 శాతంగా నమోదైంది. కంది సాధారణ విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా 77,333 ఎకరాల్లో సాగైంది. దాదాపు సాధారణం కన్నా 24,698 ఎకరాల్లో కంది సాగు పెరగడం గమనార్హం. కంది సాగు 147 శాతంగా నమోదైంది. పొగాకు సాగును నిషేధించడం వల్ల కంది సాగు పెరిగిందని అంచనా. పత్తి సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా 2,27,180 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది కంటే 62,615 ఎకరాల్లో పత్తి సాగు పెరిగింది. పత్తి సాగు 99 శాతంగా నమోదైంది. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పత్తి పంట ఊసురు తీస్తున్నాయి. వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకున్నాయి.



కంది

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో పంటల సాగు లక్ష్యం 2,25,525 ఎకరాలు. సాధారణ విస్తీర్ణం 2,21,343 ఎకరాలు కాగా 2,20,930 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. నూరు శాతం పంటలు సాగైనట్లు వ్యవ సాయ శాఖ వెల్లడించింది. వరి, పత్తి పంటలు ప్రధానంగా సాగయ్యాయి. వరి సాధారణ విస్తీర్ణం 1,53,143 ఎకరాలకు కాగా 1,55,005 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాధారణ విస్తీర్ణం 59,140 ఎకరాలు కాగా 59,835 ఎకరాల్లో సాగు చేశారు. మినుము 3,767 ఎకరాల్లో, పొగాకు 1,170 ఎకరాల్లో సాగు చేశారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు గ్రీవెన్స్

ఫిర్యాదులు స్వీకరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరగనున్న గ్రీవెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఈ క్రమంలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో బందోబస్తు ఏర్పాట్లను గుంటూరు ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం పరిశీలించారు. కార్యాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, వీవీఐపీ, వీఐపీ రాకపోకల మార్గాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. బందోబస్తు సిబ్బంది అప్రమత్తతతో, క్రమశిక్షణతో, పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీల భద్రత దృష్ట్యా కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసి మాత్రమే లోపలికి అనుమతించాలని భద్రతా విభాగం అధికారులకు సూచనలు ఇచ్చారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలతో పోలీసు సిబ్బంది సున్నితంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఎవరికీ అసౌకర్యం కలగకుండా వరుస క్రమంలో కదిలేలా చర్యలు తీసు కోవాలన్నారు. పార్టీ కార్యాలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయా లన్నారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో ఉండాలని తెలిపారు.

విద్యార్థులకు ఆధార్ నమోదు చేయాలి

సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థు లకు ఆధార్ నమోదు ప్రక్రియను నెల వ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. విద్య, మహిళా శిశు సంక్షేమ, నైపుణ్య అభివృద్ధి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి వెంటనే దరఖాస్తులు చేయించి పత్రాలు అందజేయాలన్నారు. ఈ నెల 23 నుంచి 30 వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ నర్సింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉన్న ఎస్సీ అభ్య ర్థులకు జర్మనీ భాషలో శిక్షణ ఇస్తు న్నామన్నారు. సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ, పారిశ్రామిక వేత్తలుగా తయారు కావడానికి ప్రోత్సాహం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నాణ్యంగా ఆహార సరఫరా ఉండాలి

పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే ఆహారం నాణ్యంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. పీఎం పోషణ్ - డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన కార్యక్రమంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉండరాదని చెప్పారు. వంట సామగ్రి భద్రపరచడం నుంచే సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం తయారీలో శుభ్రమైన నీటిని ఉపయోగించాలన్నారు. దుమ్ము, ధూళి పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంట ఏజెన్సీలు, వంట వారు ఆహార పదార్థాలు తయారీ సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఈవో రేణుక మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంపై జిల్లాలో నెలకు రూ.3.32 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిగ్రీ కళాశాలల ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు కళావతి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీఆర్డీఏ పీడీ విజయ లక్ష్మి, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పద్మ, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్ సందర్శనకు రాష్ట్ర గవర్నర్

మాచర్ల రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్‌ను శని, ఆదివారాల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సందర్శించనున్నట్లు తహసీల్దార్ బండెల కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. శనివారం నాగార్జున సాగర్ చేరుకుని.. హిల్ కాలనీలోని విజయ విహార్‌లో గవర్నర్ బస చేస్తారు. 19న లాంచీలో నాగార్జున కొండలోని బౌద్ధ స్థూపాలను, విజయపురిసౌత్ లాంచీ స్టేషన్, అనుపు, ఎత్తిపోతల జలపాతాలను సందర్శిస్తారు.

రూ.1.32 కోట్ల..
బయోస్టిమ్యులెంట్స్ అమ్మకాలు నిలిపివేత


గుంటూరులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహన్ రావు బృందం

గుంటూరు సిటీ, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వ్యవసాయ శాఖ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో సరైన పత్రాలు చూపించలేదన్న కారణంతో రూ.1.32 కోట్ల బయోస్టిమ్యులెంట్స్ అమ్మకాలు నిలిపి వేతకు ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఏడీఏలు నాగభైరు మోహన్ రావు, తోట శ్రీనివాసరావు, వి.కోటేశ్వరి, ఆర్.విజయబాబు, సీహెచ్ తిరుమల దేవి, ఐ.సునీత, ఏఓలు సునీల్, గౌతమ్ ప్రసన్న, ఖడ్గం రమణకుమార్, బుల్ల కిషోర్ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

'మెలియాయిడోసిస్'కు మెరుగైన వైద్య సేవలు

● రెండు నెలల చికిత్సతో కోలుకున్న తురకపాలెం వాసి
● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి


కోలుకున్న ఎలీషాతో డాక్టర్ రమణ యశస్వి, వైద్య బృందం

గుంటూరు మెడికల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెలియాయిడోసిస్ జ్వర బాధితులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. తురకపాలేనికి చెందిన పసుమర్తి ఎలీషా (46) మెలియాయిడోసిస్ బారిన పడి జీజీహెచ్‌లో చికిత్సల ద్వారా ఆరోగ్యపరంగా కోలుకున్నాడు. శుక్రవారం అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసిన సందర్భంగా సూపరింటెండెంట్ చాంబరులో డాక్టర్ రమణ యశస్వి విలేకర్లతో మాట్లాడారు. ఎలీషా మెలియాయిడోస్ బారిన పడి ఆగస్టు 21న చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరినట్లు తెలిపారు. అతడి ఎడమ మోకాలిలోని సైనోవియల్ ఫ్లూయిడ్‌ను సేకరించి పరీక్షించి మెలియాయిడోసిస్‌కు కారణమైన బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియాను గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఆరు వారాల పాటు ఎలీషాకు ఐవీ ద్వారా మీరాపెనం యాంటీబయోటిక్ మందు ఇవ్వడంతో అతడు కోలుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డిశ్చార్జి చేస్తున్నా, మరో ఆరు వారాలు అతడు ఓరల్ యాంటీ బయోటిక్ మందులు తీసుకోవాల్సి ఉందన్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన మరొక రోగికి కూడా మెలియాయిడోసిస్ పాజిటివ్ వచ్చిందని, ప్రస్తుతం అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ వెల్లడించారు. ఈ వ్యాధి బారిన పడే వారిలో 80 శాతం మంది షుగర్ బాధితులే ఉంటున్నారని ఆయన తెలిపారు. దీర్ఘకాలంగా జ్వరాలతో బాధపడే తురకపాలెం వాసులు, షుగర్ రోగులు ఆలస్యం చేయకుండా చికిత్సలు పొందాలని ఆయన కోరారు. ఎలీషాకు చికిత్స అందించిన జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సి.వాసంతి, డాక్టర్ బబిత, డాక్టర్ జి.ప్రభాకర్, పీజీలు ఆశాజ్యోతి, వి.స్వర్ణను, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ అనిల్‌ను డాక్టర్ రమణ అభినందించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,302, ఎడమ కాలువ ద్వారా 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200, మొత్తం ఔట్‌ఫ్లో 53,131 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 36,531 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0644 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0644 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 3 గేట్లను 1.50 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్ రేస్ చానల్ ద్వారా 8,555 మొత్తంగా 29813 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 32,480 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా.. ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25,375 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 39,221 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,138, పశ్చిమ డెల్టాకు 5,527, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎం-యూటీఎస్ పరికరాల ఆవిష్కరణ


మిషన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మొబైల్ అన్ రిజర్వుడ్ టిక్కెటింగ్ సిస్టమ్ పరికరాలను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణ సేన్ ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దీని వల్ల ప్రయాణికులు యూటీఎస్/ ప్లాట్‌ఫాం టిక్కెట్లు పొందడం చాలా సులభతరం అవుతుంది. ఎం-యూటీఎస్ సహాయక్‌లు రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి 500 మీటర్ల లోపల అన్ రిజర్వుడ్ టిక్కెట్లను ఈ పరికరం జారీ చేస్తారు. ప్రయాణికులు టిక్కెట్ చార్జీని నగదు/డిజిటల్ విధానంలో చెల్లించొచ్చు. దీని వల్ల రద్దీ సమయాల్లో క్యూలైన్ల బాధలు తప్పుతాయని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పల్నాడు బాలోత్సవం - 3 బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ దంపతులు

మాచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నవంబరు 29, 30 తేదీల్లో నిర్వహించనున్న పల్నాడు బాలోత్సవం - 3 బ్రోచర్‌ను శుక్రవారం మాచర్ల పట్టణంలో న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, డైరెక్టర్ జున్నా శ్రీనివాస్ దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. శాస్త్రీయ నృత్యం, పాటలు, వ్యాసరచన, కథ రచన, కథ విశ్లేషణ, కోలాటం, హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, స్పెల్ బీ, ఏకపాత్రాభినయం, మైము, మ్యూజిక్, మిమిక్రీ, డిబేట్, క్విజ్, లఘు నాటికలు, జానపద నృత్యం తదితర 65 అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. నవంబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కమిటీ ఇన్‌చార్జి ఆయేషా సుల్తానా, ఆర్గనైజేషన్ హెడ్ నెల్లూరి బ్రహ్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ కోట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుపేట హత్య కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెంచుపేట వద్ద గత మంగళవారం జరిగిన హత్య కేసును 3వ పట్టణ పోలీసులు ఛేదించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ బి.జనార్ధనరావు వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం, కోరుతాడిపర్రుకు చెందిన జూటూరి తిరుపతిరావు (60)కి అదే గ్రామానికి చెందిన గండికోట వెంకటసుబ్బారావు (36)కి గ్రామంలోని రామాలయం, చేపల చెరువు విషయంలో సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. వెంకట సుబ్బారావు తండ్రి కాలం నుంచి గ్రామంలో తిరుపతిరావుకి మెజార్టీ మద్దతుతో పైచేయిగా నడుస్తోంది. దీనిని జీర్ణించుకోలేని వెంకటసుబ్బారావు పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో తెనాలికి మకాం మార్చి కూలి పనులు చేసుకుంటున్న అతను.. తిరుపతిరావు అనారోగ్యంతో తెనాలిలోని పెద్ద కుమార్తె వద్ద ఉంటూ వైద్యం చేయించు కుంటున్నాడని తెలుసుకున్నాడు. కొన్ని రోజులు రెక్కి నిర్వహించి.. గత మంగళవారం తిరుపతిరావు చెంచుపేటలోని ఓ టిఫెన్ సెంటర్ వద్ద ఉండగా గుర్తించి కొబ్బరికాయల కత్తితో పాశవికంగా అతనిని నరికాడు. మృతి చెందాడని పూర్తిగా నిర్ధారించుకుని అక్కడ నుంచి స్కూటీపై పరారయ్యాడు. శుక్రవారం సోమసుందరపాలెం కాల్వ కట్ట రోడ్డు నుంచి వస్తున్నట్లు సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నారు. నిందితుడు గతంలో కూడా పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన సీఐ సాంబశివరావు, సిబ్బందిని అభినందించారు. ఎస్ఐలు కరిముల్లా, ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

యడ్లపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం కాపలాదారునిపై దౌర్జన్యం చేసిన ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడులోని ఓ మద్యం దుకాణంలో ఎగువ ఎస్సీ కాలనీకి చెందిన రత్నబాబు కాపలాదారుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి 12గంటల సమయంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి కాపలాదారుతో ఘర్షణ పడ్డారు. దీంతో రత్నబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శుక్రవారం నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు మద్యం దుకాణం వద్దకు వచ్చి అక్కడ పనిచేస్తున్న వారిని విచారించారు. ఆయన వెంట ఎస్ఐ శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ


స్టేషన్‌లో ఎస్పీ కృష్ణారావు, ఇన్‌చార్జి డీఎస్పీ రామకృష్ణ

వినుకొండటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను పల్నాడు ఎస్పీ కృష్ణారావు మొదటి సారిగా శుక్రవారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని పాత బస్టీలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు.

జిమ్ ట్రైనర్ ఆత్మహత్య

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉన్న ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న యువకుడు ఇంటిలో ఉరి వేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. తేలప్రోలుకు చెందిన పఠాన్ మహబూబ్ ఖాన్ (25) తన బంధువులకు చెందిన జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. వారి ఇంటిలోనే నివాసం ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండగా మృతుని అమ్మమ్మ గుర్తించి.. కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్రేమ విఫలం కావడమే ఆత్మహత్యకు కారణం అయి ఉండవచ్చునని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాస్ఫూర్తికి నిదర్శనం..
మహిళల కబడ్డీ టోర్నమెంట్


విజేత జట్టుకు బహుమతుల ప్రదానం

తాడికొండ(లాం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తికి నిదర్శనం మహిళల కబడ్డీ టోర్నమెంట్ అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా కో-ఆర్డినేటర్ డాక్టర్ డీ.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళల కబడ్డీ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న ప్రతిభ గర్వకారణం అన్నారు. క్రీడ లు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి మూలం అన్నారు. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితానికి దారితీయాలి అని పేర్కొ న్నారు. ఈ రోజు జరిగిన పోటీల్లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రథ మ బహుమతిని, తెనాలి జేఎంజే డిగ్రీ కళాశాల ద్వితీయ బహుమతిని, గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ సైన్స్ విభాగం తృతీయ బహుమతిని, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల చతుర్ధ బహుమతిని సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, ఫిజికల్ డైరెక్టర్లు రాఘవయ్య, భాను ప్రకాష్, విశ్వవిద్యాలయం క్రీడా విభాగాధిపతి, తదితరలు పాల్గొన్నారు.

కోటప్పకొండ ఆలయ హుండీల
ఆదాయం రూ.59.97 లక్షలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీల కానుకల లెక్కింపు ఈఓ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఆభరణాల తనిఖీ అధికారి పి.సైదమ్మాబాయి నిర్వహించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.55,76,935లు, అన్నదానం హుండీ ద్వారా రూ.4,20,319లు, మొత్తం రూ.59,97,254లు(102 రోజులకు) వచ్చినట్లు ఈఓ డి.చంద్రశేఖరరావు తెలిపారు. వెండి 330, బంగారం 51.500 గ్రాములు, 96 అమెరికన్, 140 కెనడా, 100 యూఏఈ డాలర్లు హుండీల ద్వారా వచ్చినట్లు తెలిపారు.

విలువల ఆధారంగా..
నాయకత్వం పెంపొందించుకోవాలి

● ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య సుధాకర్ రెడ్డి

గుంటూరు (విద్య) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది కేవలం జ్ఞాన సంపాదనకే పరిమితం కాకుండా, విలువల ఆధారంగా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని ఐసీఎస్ఎస్ఆర్ ఎస్ఆర్‌సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత వ్యాపారంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే వారికి మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఆధునిక మేనేజ్‌మెంట్ విద్యలో భారతీయ విలువలు, సాంప్రదాయ జ్ఞానం, నైతిక దృక్పథం, సుస్థిరతలను సమన్వయ పరచాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ. సూర్యనారాయణ, పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్ ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు, ఐఐటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం. పి. గణేష్ , విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

ఏఐతోనే భవిష్యత్తు ఉద్యోగాలు

● ఆచార్య సుబ్రహ్మణ్యం


ఆచార్య సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రతి రంగం కృత్రిమ మేధతో ముడి పడి ఉందని అమెరికాలోని సాన్ డియాగో ఎక్స్‌లెన్స్ ప్రెసిడెంట్, సీఈవో ఆచార్య ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'సమాజ ప్రయోజనాల కోసం కృత్రిమ మేధస్సు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, కన్స్యూమర్, ఎలక్ట్రానిక్స్‌లో సాంకేతిక పురోగతులు' అనే అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సుకు ప్రధాన వక్తగా ఆయన విచ్చేశారు. భవిష్యత్ ఉద్యోగాలన్నీ.. ఏఐ సాంకేతికతను అర్థం చేసుకునే నైపుణ్యాలపై ఆధారపడుతాయని సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులు ఏఐ, డేటా సైన్స్, కంప్యూటింగ్ వంటి రంగాల్లో సాంకేతికతను పెంచుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరామ ప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు. విద్య, పరిశోధన, సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు వర్సిటీ అందిస్తున్న సాంకేతిక అవకాశాలను సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేక అతిథి ఐఎంఆర్ఎఫ్ చైర్మన్ రత్నాకర్, ప్రిన్సిపల్ ఆచార్య లింగరాజు, సహాయక ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీకృష్ణ, చంద్రమౌళి, ఉద్యోగ కల్పన సమన్వయకర్త డాక్టర్ తౌసీఫ్ అహ్మద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1,550 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన రేషన్ బియ్యంతో అర్బన్ సీఐ

పొన్నూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 1,550 కేజీల రేషన్ బియ్యంను అర్బన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరానాయక్ కథనం ప్రకారం.. పట్టణంలో గస్తీ పోలీసులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గురించి సమాచారం అందింది. దీంతో ఎస్సై బి.శ్రీహరితో కలిసి సీఐ పట్టణంలో సోదాలు నిర్వహించారు. షరాబజార్ సమీపంలో ఒక ట్రాలీని ఆపగా.. ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. షేక్ మెమన్‌బాష అలియాస్ రబ్బాని, మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన అవ్వారు శ్రీనివాసరావు, నిజాపట్నంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన పేరు చందనం అంకమ్మ నాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో 31 బస్తాల్లో ఉన్న రేషన్ బియ్యం గుర్తించారు. పట్టణంలోని మునీర్ అనే రేషన్ డీలర్ నుంచి బియ్యం కొనుగోలు చేసి.. బోడపాడు గ్రామానికి చెందిన గోవతోటి ఆనంద వద్దకు తరలిస్తున్నట్లు పట్టుబడిన వ్యక్తులు వెల్లడించారు. పట్టుబడిన ముగ్గురితో పాటు రేషన్ డీలర్ మునీర్, బోడపాడుకు చెందిన ఆనందపై నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరా నాయక్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

42,710 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 37,368 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,710 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,578 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12600
334	10000	15000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	10500	13800	నెంబరు. 5	10000	14800
341	10000	15500	341	10000	15800
4884	----	----	4884	10000	14000
సూపర్ 10	----	----	సూపర్ 10	10000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15300	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



బెటాలియన్‌లో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి బందోబస్తు

● ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఈ నెల 21న జరగనున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మంగళగిరిలోని బెటాలియన్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ 'పోలీస్ అమర వీరుల దినం' కార్యక్రమం పోలీస్‌శాఖకు గర్వకారణమైన రోజు. విధి నిర్వహణలో ప్రాణా లు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పోలీస్ సిబ్బందికి గౌరవం, బాధ్యత అన్నారు. కార్యక్రమంలో 6వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ మురళీ, అదనపు ఎస్పీ రవికుమార్, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీని వాసరావు, బెటాలియన్ అధికారులు, ఇంజినీరింగ్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికి 'పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే'

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రతి శుక్రవారం పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికై 'పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే' నిర్వహించనున్నట్లు ఎస్పీ వకుల్ జిం దాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బం ది సమస్యల పరిష్కారానికై 'పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని ఆయన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ సిబ్బంది నుంచి వివిధ వినతులు, ఫిర్యాదులను స్వీక రించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో మొత్తం 15 మంది పోలీస్ సిబ్బంది తమ బదిలీలు, సర్వీసు సంబం ధిత సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పించగా, వాటిపై ఎస్పీ సానుకూలంగా స్పందించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది తమ సమ స్యలను నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చని కూడా ఆయన పేర్కొ న్నారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమమైన పోలీస్‌సేవలు అందించాలని, ప్రజల్లో భరోసా కల్పించే విధంగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు.



హంస జిల్లా కార్యాలయం ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

ఉద్యోగుల సర్వీసు సమస్యలను పరిష్కరిస్తాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి

గుంటూరు మెడికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే ఉద్యోగులు సర్వీసు సమస్యలు ఉంటే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని డీఎం హెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఏపీ హంస అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు ఏపీ హంస లోగోను ఆవిష్కరించారు. ఏపీ హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ నాగవర్ధన్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో గుర్తింపు ఉన్న ఏకైక సంఘం ఏపీ హంస మాత్రమేనని తెలిపారు. ఆరోగ్యశాఖలో పని చేసే ఏ కేడర్ ఉద్యోగులైనా అసోసియేషన్ ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తాము కోరిన వెంటనే తమ అసోసియేసిన్‌కు భవనం మంజూరు చేసిన డీఎంహెచ్‌వోకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నాగవర్ధన్ చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి రత్నశ్రీ, జిల్లా మలేరి యా శాఖాధికారి సుబ్బరాయణం, ఏపీ హంస రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పి.రాజ్యలక్ష్మీ, జిల్లా కోశాధికారి వెంకటప్పయ్య, ఉపాధ్యక్షుడు ఎండీ షరీఫ్, నగర అధ్యక్షుడు నరేంద్రబాబు, ఆశాలత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

● ఏపీ విద్యుత్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేశ్వరరావు

గుంటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, జేఎల్‌ఎమ్ గ్రేడ్-2ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడతామని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. యాజమాన్యంతో జేఏసీ నాయకులు చర్చల సందర్భంగా స్ట్రగుల్ కమిటీ వి.రామ్‌ప్రభాకర్, జి.నాగరాజుల అధ్యక్షతన సంగడిగుంటలో నున్న విద్యుత్‌భవన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు బి.లక్ష్మణరావు, జిల్లా నాయకులు సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసే వరకు, గ్రేడ్.2 కార్మికులకు న్యాయం చేసేవరకు, పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర నాయకులు అబ్దుల్ సలీం, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టీ, 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీహర్ష, విద్యుత్ (సీఐటీయూ) యూనియన్ నాయకులు పవన్, రాంబాబు, శివనాగేశ్వరరావు, సురేష్, నాగరాజు, సలీంబాషా, వర్మ, వంశీ, బి.రవి కుమార్, వీరారెడ్డి, లెనిన్‌బాబు, రాజశేఖర్ తదితరులున్నారు.



నిరసనలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగా హన అవసరమని సీఐ వెంకటప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ లారెన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి ఇటువంటి నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు సైబర్ నేరాల బారిన పడినవారు వెంటనే పోలీసులను సంప్ర దించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐ బాషా, పాఠశాల కార్యదర్శి మేకల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ వెంకటప్రసాద్ తదితరులు

రక్తహీనత చిన్నారులపై దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తహీనత చిన్నారులు, గర్భిణులు, బాలింతలపై దృష్టి సారించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత గల వారిని గుర్తించాలని ఆదేశించారు. గ్రామ సచివాలయం స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు. రక్తహీనత గల చిన్నారులు, గర్భి ణులు, బాలింతల జాబితా పక్కాగా తయారు చేయాలని చెప్పారు. రక్తహీనత ఉన్నవారికి పౌష్టిక ఆహారం అందాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు.

బాల్య వివాహాలు ఎక్కువగా ఏ గ్రామాల్లో జరుగుతున్నాయో గుర్తించాలని సూ చించారు. ఆయా గ్రామాల్లో కమిటీ సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాల ముఖచిత్రాలు మారాలని కలెక్టర్ అన్సారియా అన్నారు. వివిధ ఇంజనీరింగ్, సంక్షేమ శాఖలతో శుక్రవారం ఆమె తన కార్యాలయంలో సమీక్షించారు. వసతి గృహాల భవనాలు సుందరంగా, ఆహ్లాదకరంగా మారాలని తద్వారా అందులో ఉంటున్న విద్యార్థుల మానసిక స్థితిలో మార్పు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డీ శ్రీనివాసులు మాట్లాడుతూ అమృత్ పథకం కింద ఏడు ప్రాజెక్టులకు రూ.331 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. తక్కెళ్ళపాడు నుంచి బుడంపాడు వరకు పైపు లైన్లు వేసి ఏటుకూరు గ్రామం వద్ద ఐదు లేఅవుట్లకు నీరు ఇచ్చుటకు పనులు చేపడుతున్నామని వివరించారు. గోరంట్ల వద్ద రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా చుట్టు పక్కల గ్రామాలకు కూడా నీరందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రహదారులు, భవనాలశాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మంగళగిరి-తాడికొండ రహదారి నిర్మాణంలో నిడమర్రు వద్ద ఆక్రమణలు తొలగించాల్సి ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ రహదారులు సంస్థ అధికారి మాట్లాడుతూ విజయవాడ బైపాస్ రహదారితో పాటు ఇతర ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. కొండవీటి కోట, చినకాకాని వద్ద పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. టిడ్కో పర్యవేక్షక ఇంజనీర్ ఉమాశంకరశాస్త్రి మాట్లాడుతూ టిడ్కో కాలనీలలో మురుగు నీటి శుద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. వెంగళాయ పాలెంలో మౌళిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ దీపావళి తరువాత గృహ ప్రవేశాలు చేయుటకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి ప్రసూన, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రమణమూర్తి, జడ్పీ సీఈవో జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డీ దుర్గా బాయి, డీఈవో రేణుక, నగర పాలక సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సుందరరామి రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ టి.సందీప్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసెస్, జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ నవంబరు 3వ తేదీ నుంచి, టైలరింగ్ కోర్స్ నవంబరు 17వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. శిక్షణకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు అర్హులని తెలిపారు. ఎం పికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి చదివి, 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండాల ని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధారకార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 10వ తరగతి విద్యార్హత కాపీలతో యూనియన్ బ్యాంకు గ్రామీణ అభివృద్ధి సంస్థ, కొత్తపేట, ఓల్డ్ బ్యాంకు స్ట్రీట్, గుంటూరు అనే చిరునామాలు సంప్రదించాలని సూచించారు. వివరాలకు 08632336912, 9700687696 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో...

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ కొండా సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళా శాలలో స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెం డెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి శిక్షణ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు వివరించారు. శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్నవారు అర్హులని తెలిపారు. వివరాలకు 6304292828లో సంప్రదించాలని సూచించారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు పెరుగుతున్న ధరల కు అనుగుణంగా తక్షణమే వేతనాలు పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షురాలు రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఎన్నికలకు ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భారంగా ఉన్న యాప్‌ను రద్దు చేయకపోగా కొత్త యాప్‌లతో మరింత భారాన్ని రుద్దుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావే శంలో ధనలక్ష్మి, ఏవీయన్ కుమారి, రత్న మంజుల, ప్రేమలత, అస్మిత్తారా, శివలీల శివ పార్వతి, షాహిదా, దండా లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ, పాల్గొన్న అంగన్వాడీలు

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవిం గ్స్ ఉత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ స్టేడియంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో ఆఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో క్రీడా వస్తువులు అందుబాటులోకి వస్తాయ ని తెలిపారు. ఈ విధానంలో పేద క్రీడాకారులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ రాధిక, స్థానిక కార్పొరేటర్ మీరావలీ, జిమ్నాస్టిక్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎస్‌డీవో ఆఫ్రోజ్‌ఖాన్, క్రీడాకారులు, కోచ్‌లు

క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన అవసరం

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): క్వాంటం వ్యాలీపై విద్యార్థులు అవగా హన పెంచుకోవాలని డీవైఈవో ఏసురత్నం సూచించారు. శుక్రవారం పరీక్ష భవన్లో క్వాం టం వ్యాలీపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు కృషి చేస్తున్నారని తెలి పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మొ దటి స్థానంలో కాకుమాను మండలం చినలింగాయపాలెం ఉన్నత పాఠశాల విద్యా ర్థిని బ్లెస్సీ, ద్వితీయ స్థానంలో తాడికొండ మండలం కంతేరు ఉన్నత పాఠశాల విద్యా ర్థిని ఎం.మోక్ష, తృతీయ స్థానంలో చేబ్రోలు మండలం నారాకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస దివ్య విజేతలుగా నిలిచా రు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మేరా, ఎంఈవో హవేల పాల్గొన్నారు.

● కాకుమాను మండలపరిధిలోని చిన్నలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బ్లెస్సీని ఎంఈవో -2 కొల్లి విజయ్‌భాస్కరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.



ఉత్సవ్ ఎగ్జిబిషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న బూర్ల రామాంజనేయులు, జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురి తదితరులు

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక ఏసీ కళాశాలలో జరుగుతున్న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రదర్శనలో ఎలక్ట్రానిక్, క్రీడలు, వస్త్ర, ఆయుర్వేద, ప్రకృతి సాగు ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు తదితర స్టాల్స్‌ను పరిశీలించి, ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రం 8వేల కోట్లు ఆదాయం కోల్పోతుందని వివరించారు. పేద ప్రజల పొదుపు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంస్కరణలకు ఆమోదం తెలిపారన్నారు. పన్నులు తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజులు సదస్సులు, ర్యాలీలు ఎగ్జిబిషన్ ద్వారా విస్తృత స్థాయిలో అవగా హన కల్పిస్తున్నామని వివరించారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడంతో ఎగుమతి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురి, సహాయ కమిషనర్ అనసూయ, అధికారులు, వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజధాని మహిళలకు అద్భుత అవకాశం

● ఔత్సాహికులకు వ్యాపార రంగాలపై శిక్షణ ● నిరుద్యోగ యువతకు సాంకేతికత, నైపుణ్యాల పెంపు

గుంటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని యర్రబాలెం గ్రామంలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో మహిళల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈడీపీ) ప్రారంభమైంది. ఈనెల 16న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మహిళల స్వయం ఉపాధి, సాధికారత పెంపొందించడం కోసం 26 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్(జీఎఫ్ఎఫ్‌డీ) సంస్థ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఈడీఐఐ- అహ్మదాబాద్), యాక్సెంచర్ సంస్థలతో కలిసి అమరావతిలో అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాజధాని ప్రాంత మహిళలు, నిరుద్యోగ యువతకు వ్యాపార నిర్వహణకు అవసరమైన సాంకేతిక, ఆచరణాత్మక నైపుణ్యాలను అందిస్తారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు సహకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు మందడం, తుళ్లూరు మండలంలోని అనంతవరం, తాడేపల్లి మండలంలోని ఉండవల్లి రూరల్, మంగళగిరి మండలంలోని యర్రబాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అనంతవరం, ఉండవల్లి, యర్రబాలెం గ్రామాల్లో శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రతి బ్యాచ్‌లో 26 రోజులపాటు బిస్కెట్లు, స్నాక్స్, సంప్రదాయ స్వీట్స్, టిఫిన్ పదార్థాలు, మిల్లెట్ ఆధారిత పోషకాహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ అందించనున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు పాల్గొనే అవకాశం కల్పించారు. స్వయం ఉపాధి పొందేందుకు మహిళలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గ్రైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీఐఐ అహ్మదాబాద్ ప్రాజెక్టు అధికారి ఎడ్మండ్ భూపతి, జీఎఫ్ఎఫ్‌డీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మాధవీలత, ప్రాజెక్టు మేనేజర్ రుబిందర్ కౌర్, మాస్టర్ ట్రైనర్ సురేంద్రకుమార్, సీఆర్డీఏ లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్ ఎస్.వి. నరసింహం, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమా ల వివరాల కోసం లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్ ఎస్.వి. నరసింహం 9550311637, జీఎఫ్ఎఫ్‌డీ ప్రాజెక్ట్ మేనేజర్ రబిందర్‌కౌర్ 96183 74402 నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

● గ్రీవెన్స్ డేలో ఏడీసీ భార్గవతేజ



వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ భార్గవ తేజ

తుళ్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని సీఆర్డీఏ అడిషినల్ కమిషనర్ ఏ భార్గవతేజ చెప్పా రు. రాజధాని రైతుల, రైతుకూలీల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వార్షిక కౌలు చెల్లింపు, గ్రామకంఠం సమస్యలు, రిటర్న బుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంత వాసులు తమ అర్జీలను ఆయనకు అందజేశారు. అర్జీదారులు అందజేసిన సమ స్యలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని అర్జీదారులకు తెలియజేశారు. ఏపీ సీఆర్డీఏ లోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియ జేసిన పలు ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేలో 39 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిడ్రెస్సల్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారి పీ జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, పీ పద్మావతి, ఏజీ చిన్ని కృష్ణ, జీ రవీందర్, బీ సాయి శ్రీనివాస్ నాయక్, బొర్రా శ్రీనివాసరావు, ఎస్ రవీంద్రప్రసాద్, సీహెచ్ మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులనీరు శుక్రవారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 25,375 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 1133 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 200, పశ్చిమకాల్వకు 208, నిజాంపట్నం కాల్వకు 414, కొమ్మమూరు కాల్వకు 2780 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

హాస్టల్ పిల్లలను సొంతబిడ్డల్లా చూసుకుంటాం

● విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హాస్టల్ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. స్థానిక బీసీ వసతి గృహంలోని 240 మంది విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నసీర్ దుప్పట్ల కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలం వస్తున్న నేపథ్యం లో హాస్టల్ విద్యార్థులకు దుప్పట కిట్‌ను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల మంది విద్యార్థులకు రూ.6.12 కోట్లతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 2700మంది పిల్లలు ఉన్నారని, వీరందరికీ అందిస్తున్నామని తెలిపా రు. ఒక్కొక్క విద్యార్థికి రూ.668 వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని చెప్పారు.

గుంటూరు ఈస్ట్ న్యాయవాదుల నూతన కమిటీ



న్యాయవాదుల కమిటీతో ఎమ్మెల్యే నసీర్

టీడీపీ నేతలకు ఏ సమస్య వచ్చినా న్యాయపరంగా పోరాడేందుకు ముందుండాలని నసీర్ చెప్పారు. తూర్పు నియోజకవర్గ న్యాయవాదుల కమిటీని శుక్రవారం ఆయన ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా కాలె దేవదాస్, ఉపాధ్యక్షులుగా నర్మద, భాస్కర్, ఉమర్ ఆలీ, సిద్ధా సత్యనారాయణ ఎన్నికయ్యారు.

● శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నా మని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆనంద్‌పేట, పాత గుంటూరు, ఎల్‌ఆర్ కాలనీ శ్మశాన వాటికలు ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వంలో కనీసం శ్మశాన వాటికలను కూడా పట్టించుకోలేదని విమర్శిం చారు. నియోజకవర్గంలోని శ్మశానాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు.

23 నుంచి హాకీ పోటీలు

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ సంఘ కార్యదర్శి ఎం అజయ్‌బాబు తెలిపారు. భారత హాకీ సంఘం గ్వాలియర్‌లో ఏర్ప డి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హాకీ ఇండియా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు జరపనుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో చివరి రోజు అయిన ఏడో తేదీన హాకీ ముగింపు పోటీలు, వేడుకలు జరుగుతాయని అన్నా రు. ఈ పోటీలకు రాష్ట్ర, జిల్లా క్రీడాకారులతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ప్రముఖ ఆటగాళ్లు పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా ఎస్‌వీఎన్ కాలనీ, తారకరామనగర్, స్తంభాలగరువు మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలానే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా లైన్స్ షిఫ్టింగ్‌కు సంబంధించి పట్టాభిపురం డీఆర్‌ఎం కార్యాలయ రోడ్డు, ఎన్‌సీసీ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వీరుల గాధలో.. పరిఢవిల్లిన ఆధ్యాత్మికం

పల్నాడు అంటే దాయాదుల పోరు.. శైవ, వైష్ణవ మత సంఘర్షణలు.. ఎందరో వీరుల మరణాలు.. ఇదే చాలా మందికి తెలుసు.. కానీ పల్నాట 12వ శతాబ్దంలోనే సర్వమత సమానత్వం.. ఆధ్యాత్మిక చింతన పరిఢవిల్లిందనే విషయం అతి కొద్ది మందికే అవగతం. నాటి గుర్తులు నేటికీ పదిలంగానే ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే భావితరాలకు చరిత్రను అందించడంతోపాటు దేశ చరిత్రలో మన కంటూ స్థానం సంపాదించవచ్చు. రాజులు, రాజ్యాలు, వీరులు, వీరగాథలు.. తనలో ఇముడ్చుకుంది నాటి కార్యమపూడి.. నేటి కారంపూడి.

- కారంపూడి, ఆంధ్రజ్యోతి

పల్నాట సర్వమత సమానత్వం

నాటి సాక్ష్యాలు నేటికీ సజీవం

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం మేళవింపు

నాటి కార్యమపూడి.. నేడు కారంపూడి

పర్యాటకం.. ప్రశ్నార్థకమేనా..?

మంత్రాలమ్మ కనుమ

నాటి కార్యమపూడి నేడు కారంపూడిగా పిలువబడుతోంది. యుద్ధ భూమికి దక్షిణ భాగాన నాలుగు మైళ్ల దూరంలో ఉన్న మంత్రాలమ్మ కనుమను నాయకురాలి కనుమగా పిలుస్తుంటారు. అక్కడ మంత్రాలమ్మ అమ్మవారి దేవాలయం పల్నాటి యుద్ధం జరిగిన 1184కు పూర్వమే ఉంది. ఈ అమ్మవారి దేవాలయాన్ని మహిమ గల దేవతగా ఆ నాటి నుంచి ఈ ప్రాంత వాసులు కొలుస్తుంటారు. పల్నాటి యుద్ధానికి తన సైన్యంతో బ్రహ్మనాయుడు త్రిపురాంతకం వద్ద ఉన్న మేడపి నుంచి తరలివస్తుంటాడు. సమాచారం తెలిసిన నాయకురాలు నాగమ్మ.. బ్రహ్మన్న సైన్యాన్ని యుద్ధ భూమికి రానీవ్వకుండా మంత్రాలమ్మ కనుమ వద్ద రహదారి లేకుండా చేస్తుంది. దీనికి ఆగ్రహించిన బ్రహ్మనాయుడు కనుమ వద్దనున్న కొండను తన ఆయుధమైన నృసింహకుంతంతో నరికి దారి చేసుకొని సైన్యాన్ని ముందుకు నడిపించాడు. నాయకురాలు నాగమ్మ అడ్డు వేయడంతో ఈ మంత్రాలమ్మ కనుమకు నాయకురాలి కనుమగా పేరొచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. బ్రహ్మనాయుడు కుమారుడైన బాలచంద్రుడు ఈ కొండపై నుంచే తన గుర్రాన్ని దూకించాడని ఆ ప్రదేశంలో చూపిస్తుంటారు. ఇప్పటికీ వీరాచార వంతులు ప్రతి ఆదివారం మంత్రాలమ్మ అమ్మవారికి పూజాదులు చేసి నివేదనలు అర్పిస్తుంటారు. మహిమ గల శక్తి అమ్మవారుగా ఈ ప్రాంత వాసుల నమ్మకం.

చెన్నకేశవస్వామి ఆలయం

కారంపూడిని మాచర్ల, గురజాల రాజులు తమ యుద్ధభూమిగా నిర్ణయించకముందే ఇరు రాజ్యాల రాజులు కారంపూడికి వస్తుంటారు. కారంపూడిలో చెన్నకేశవస్వామి దేవాలయాన్ని బ్రహ్మనాయుడు నిర్మించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దర్శనానికి వచ్చేటప్పుడు బ్రహ్మనాయుడు తన మేడలో విశ్రమించేవారు. చెన్నకేశవస్వామి దేవాలయంలో ఒక బావి ఉంది. గంగధార మడుగులో స్నానమాచరించి నేరుగా ఈ బావి నుంచి వెలుపలకు వచ్చి చెన్నకేశవస్వామిని దర్శించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. కాగా ఈ బావి ప్రస్తుతం మూసివే



యుద్ధభూమి

శారు. ఈ బావిలో నీరు తీర్థంగా తాకితే ఎక్కడలేని పౌరుషం పుట్టుకొస్తుందని, అందువల్ల అనర్థాలకు దారితీస్తుందని మూసి వేశారని చెబుతారు. వీరారాధన ఉత్సవాలు లేని సమయంలో బ్రహ్మనాయుడు నృసింహ కుంతం, కన్నమదాసు భైరవఖడ్గం, బాలచంద్రుడి సామంత రాగోల ఆయుధాలు ఈ దేవాలయంలోనే భద్రపరుస్తారు. ఉత్సవాల సమయంలో వీరాచార వంతులు తమ కొణత ములతో చెన్నకేశవస్వామి ఆరాదిస్తారు. బ్రహ్మనాయుడు ఈ ఆలయంలోనే సర్వమత సమానత్వం కొరకు సహపంక్తి భోజనాలు పెట్టేవారు. క్రీస్తు శకం 1315లో ఈ ఆలయ పునరుద్ధరణ జరిగినట్లు కథనం.



కోట బురుజు

రాక్షస సొరంగాలు..

పెదకొదమగుండ్ల రహదారిలో ఆనాటి రాక్షస సొరలు (సొరంగాలు) నేటికీ కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలోనే బ్రహ్మనాయుడు పులిజూదం ఆడిన ప్రదేశం కనిపిస్తుంది. కాగా గురజాల రాజ్యంగా పాలిస్తున్న మంత్రి నాయకురాలి నాగమ్మ తన సైన్యంతో కారంపూడి యుద్ధ భూమికి తరలి వచ్చేటప్పుడు ఈ రాక్షస సొరంగాల గుండా రాక్షస బండకు చేరుకొని విశ్రమించారని చరిత్రకారులు చెబుతున్నారు. 12వ శతాబ్దపు జ్ఞాపకాలు చారిత్రక చిహ్నాలు నేటికీ సజీవంగా కనువిందు చేస్తున్నాయి.

ముస్లింలు నిర్మించిన వీర్ల దేవాలయం



పల్నాటి యుద్ధం అనంతరం ఔరంగజేబు సైనికులు కారంపూడి మీదుగా వెళ్తూ యుద్ధ భూమిలో విశ్రమించారు. వీరుల రాతి చిహ్నాలను రాళ్లుగా బావించి వంటావార్పు చేశారు. భోజనం అనంతరం సైనికులు నురగలు కక్కుతూ పడిపోగా చెన్నకేశవస్వామి వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో అక్కడకు వచ్చి వీరుల చరిత్రను వివరించి వారిని కాపాడినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో జాఫర్, ఫరీద్ అనే సోదరులు యుద్ధ భూమిలో వీర్ల దేవాలయం నిర్మించి అక్కడే జీవసమాధి పొందారు. హిందూ దేవాలయంలో ముస్లింల సమాధులు ఉండడం, ఆ సమాధుల వద్ద నేటికీ ప్రజలు పూజలు నిర్వహిస్తుండడం విశేషం. కాగా ఈ ఆలయంలో కన్నమదాసు (మాల సామాజిక వర్గీయుడు)కు గుడి కూడా ఉంది. 12వ శతాబ్దంలోనే పల్నాటి బ్రహ్మనాయుడు సర్వమత సమానత్వం పాటిస్తూ చాపకూడు (సహపంక్తి భోజనాలు) నిర్వహించారనే చారిత్రక ఆధారాలున్నాయి. నేటికీ వీరారాధన ఉత్సవాల్లో వీర్ల గుడి ప్రాంగణంలో కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసి చాపకూడులో పాల్గొంటారు.

నాగులేరులోని గంగధార మడుగు..

వీర్ల దేవాలయ సరిహద్దులో దక్షిణం నుంచి ఉత్తరంగా ప్రవహిస్తోంది నాగులేరు. ఇక్కడ నాగులు అనే జాతి వారు నివసించారని, అందుకే దీనికి నాగులేరు అనే పేరు వచ్చిందంటారు. ఈ నాగులేరులో నీటి మడుగు అంతరవాహినిగా ఉంది. ఆ మడుగునే గంగధారి మడుగు అని వ్యవహరిస్తుంటారు. ఉత్తర వాహినిగా ప్రవహించే నదిని పుణ్యనది అంటారు. ఈ నదినే కాశిలోని మణికర్ణిక ఘాట్‌తో శ్రీనాథ మహాకవి పోల్చారు. ఈ మడుగులో వీరాచారవంతులు స్నానాధులు చేయడమే కాకుండా తమ ఆయుధాలకు ఈ మడుగులో స్నానమాచరింపజేస్తారు. కోట బురుజు నుంచి బాలచంద్రుని పొట్టేలు దూకగా పడిన గిట్టల గుర్తులు ఇప్పటికీ ఉన్నాయి. ప్రజలు ఇప్పటికీ ఈ గుర్తుల వద్ద పూజలు చేస్తుంటారు.



మంత్రాలమ్మ అమ్మవారు

మరికొన్ని ముఖ్య ప్రదేశాలు

కాగా కారంపూడిలో సందర్శించవలసిన మరికొన్ని ముఖ్య ప్రదేశాలు ఉన్నాయి. యుద్ధభూమికి ఎదురుగా పల్నాటి యుద్ధానికి పూర్వమే అంకాళమ్మ దేవాలయం ఉంది. ఈ దేవాలయ కిటికీలో నుంచి అమ్మవారు యుద్ధం వీక్షిస్తూ వీరుల మరణాలకు చలించి తల ఒరిగిపోయి కన్నీరు కార్చింది. అమ్మవారి కన్నీరు కింద పడితే అరిష్టమని ఆనాడు పూజారులు గిన్నెను అమర్చారు. ఇప్పటికీ గిన్నె అలానే ఉంది. అలాగే కన్నమదాసు మేడ, వీర్ల దేవాలయంలోని నాటి వీరుల ఆయుధాలు, బ్రహ్మనాయుడు ప్రతిష్ఠించిన కాలభైరవుని విగ్రహం, శంకుతీర్థ మండపం, కల్లి తోరణం, కారంపూడి గ్రామానికి రక్షణ కోసం వేసిన ముగ్గు, బ్రహ్మనాయుడు మేడ, బ్రహ్మనాయుడు పులిజూదం ఆడిన ప్రదేశం, బాలచంద్రుడు విశ్రమించిన ప్రదేశం, పోతురాజు మండపం, రాక్షసబండ ఇలా అనేకం ఉన్నాయి. పర్యాటక ప్రాంతంగా కారంపూడిని అభివృద్ధి చేస్తే నాటి చరిత్రను బావితరాలకు అందించడంతోపాటు దేశ చరిత్రలో సముచిత స్థానం కల్పించినట్లవుతుందని పల్నాటి వాసులు కోరుతున్నారు.

కల్తీ వరి విత్తనాలతో.. రోడ్డెక్కిన రైతులు

కొల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్తీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులు రోడ్డున పడ్డారని, వారికి న్యాయం చేయాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన 35 మంది రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో కొల్లూరులోని వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించి, ఏవో సురేంద్రబాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. పది రోజుల క్రితం ఎన్నార్లై విత్తన సంస్థ అందించిన బీపీటీ విత్తనాలు బెరుకు ఉందని రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించడం జరిగిందన్నారు. దీంతో మండల వ్యవసాయాధికారి అనంతవరంలో బెరుకు వచ్చిన వరి పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్నార్లై విత్తన పరిశోధన ప్రతినిధులతో చర్చించారని తెలిపారు. వారు కూడా గ్రామానికి చేరుకుని రైతుల సమక్షంలో పంట పరిశీలన అనంతరం పంటలో బెరుకు వచ్చిన మాట వాస్తవమని ఎకరాకు ఐదు బస్తాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తమ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధులతో చర్చించి న్యాయం చేస్తామంటూ 15వ తేదీ వరకు గడువు కావాలని కోరారన్నారు. దానికి అంగీకరించిన రైతులు.. ఇప్పుడు తమకేం సంబంధం లేదని విత్తన సంస్థ ప్రతినిధులు చేతులు ఎత్తి వేయడంతో న్యాయం చేయాలంటూ వ్యవసాయ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వినతి పత్రం ఇచ్చినా ఏవో పట్టించుకోకపోవడంతో కడుపు మండిన రైతులు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద తెనాలి - రేపల్లె ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు, మండల నాయకులు సుబ్బారావు, రైతులు ధూళిపాళ్ల రవి, జాలాది రంగారావు, నాగళ్ల కృష్ణారావు, ధూళిపాళ్ల చిన్న, కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల రాంబాబు, ధూళిపాళ్ల నాని, కౌలు రైతులు రామకోటయ్య, వాసు, రామారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించిన అనంతవరం గ్రామ రైతులు

సీటు.. వదిలేది లేదు!

డీఎంహెచ్ఓ ఆదేశాలు బేఖాతర్

వైద్యాధికారి తీరుపై ఆరోగ్య శాఖలో విస్మయం


ప్రజా ప్రతినిధి వద్దకు క్యూ కడుతున్న నేతలు

గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో వింత పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇచ్చిన ఆదేశాలను ఒక వైద్యాధికారి పక్కన పెట్టడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఒక వైద్యునిపై రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మండలానికి చెందిన నాయకులు కూడా ముఖ్య ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్లి సదరు ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న విషయాలను వివరించారు. దాంతో విచారణ నిర్వహించిన జిల్లా అధికారులు సంబంధిత వైద్యుని డ్రాయింగ్ పవర్స్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివాదాస్పద వైద్యుని డ్రాయింగ్ పవర్స్ తొలగించి, అదే ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న మరో వైద్యురాలికి బాధ్యతలు అప్పగిస్తూ సెప్టెంబరు 16న డీఎంహెచ్ఓ కె విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. డీఎంహెచ్ఓ ఆదేశాలు ఇచ్చిన వెంటనే వాటిని అమలు చేయాల్సి ఉండగా మహిళా వైద్యురాలిని పెదనందిపాడు ఆరోగ్య కేంద్రంలోని కొందరు ఉద్యోగులు బెదిరిస్తున్నట్లు వార్తలు బయటకు రావడం చర్చనీయాంశమైంది. డీఎంహెచ్ఓ ఆదేశాలకు అనుగుణంగా చార్జి అప్పగించకుండా కాలయాపన చేయడం.. మహిళా వైద్యురాలిని కొందరు బెదిరిస్తూ ఉండటంతో అక్కడ ఉన్న నేతలు మళ్లీ ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న వైద్యున్ని ఫిరంగిపురం బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారని కూడా తెలిసింది. ఈ విషయాలను డీఎంహెచ్ఓ కె.విజయలక్ష్మి దృష్టికి తీసుకు వెళ్లగా పెదనందిపాడు పీహెచ్‌సీ డ్రాయింగ్ పవర్స్ డాక్టర్ ప్రియం వదకు వెంటనే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశానని చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శకద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులనీరు శుక్రవారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 25,375 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 1133 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 200, పశ్చిమకాల్వకు 208, నిజాంపట్నం కాల్వకు 414, కొమ్మమూరు కాల్వకు 2780 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ కొండా సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెం డెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నట్లు వివరించారు. శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు 630 4292828లో సంప్రదించాలని సూచించారు.

రేపు మెగా కంటివైద్య శిబిరం

పెదనందిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోకా పాఠశాలలో సాయిమందిర్ వారు రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు వారి సంయుక్తంగా శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ వైద్యశిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా అధార్, రేషన్ కార్డు జిరాక్సులతో పాటు ఫోన్ నెంబరు తీసుకొని రావలెనని తెలిపారు. ప్రాంత ప్రజలు కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పశు సంపదను పెంపొందించుకోవాలి

కాకుమాను, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు పంటలతో పాటు పశు సందను పెంపొందించుకోవాలని పశు వైద్యురాలు డాక్టర్ వై పద్మావతి తెలిపారు. మండలపరిధిలోని వల్లూరులో శుక్రవారం పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత గోవుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా తెనాలి డివిజన్ ఉప సంచాలకు పద్మావతి వైద్యుల బృందం 45 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 20 దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో నిడుబ్రోలు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు కేశవరావు, వైద్యులు శైలజ, యాస్మిన్, శ్రీనివాసరావు, సౌమ్య, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై దాడి

తాడికొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న మతి స్థిమితం లేని యువతిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి గాయపరిచిన ఘటన గురువారం రాత్రి తాడికొండలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన గాయత్రి అనే యువతికి మతిస్థిమితం లేదు. యువతికి తల్లి, సోదరుడు ఉన్నారు. తల్లి పని మీద విశాఖపట్నం వెళ్లారు. సోదరుడు గురువారం రాత్రి ఇంట్లో పడుకోకుండా తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. యువతి ఇంట్లో ఒక్కటే ఉన్నది. అయితే ఇంట్లో ఎవరు లేరు అని తెలుసుకున్న గుర్తుతెలియని వ్యక్తి మద్యం తాగి నిద్రిస్తున్న ఆమెపై దాడి చేశారు. ముఖంపై విచక్షణ రహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మతిస్థిమితం లేకపోవటంతో తనపై దాడిచేసిన వ్యక్తిని గుర్తు పట్టలేని పరిస్థితి. ఉదయం సోదరుడు ఇంటికి రాగానే యువతిని తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాంగోపాల్, వీరయ్య చౌదరి, పూర్ణచంద్రరావు

కాకుమాను, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాకుమాను శివారు కొండపాటూరు రహదారిలో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లను టీడీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్ మాట్లాడుతూ హాస్టల్‌లో ఉన్న 51 మంది విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు అందించిందని తెలిపారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. సంగండెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి మాట్లాడు తూ ఇటీవల అన్నవరంలో జరిగిన ఫుడ్ పాయిజన్ నేపథ్యంలో హాస్టల్‌లో ఉండే విద్యార్థుల ఆహారం విషయంలో సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమోతు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, సమయ పాలన పాటించే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు హాస్టల్‌లో విద్యార్థుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లమోతు వీర శంకరరావు, అంకమ్మ చౌదరి, కొల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

సలాం హోటల్ సెంటర్లో ఫ్రైడే డ్రైడే

తాడేపల్లిటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యాపించు వ్యాధులు రాకుండా ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డ్రైవర్స్‌కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో తాడేపల్లి సలాం సెంటర్‌లో గృహాలను హెల్త్ అసిస్టెంట్ జయరాజు, మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ఉత్సవ్ ఎగ్జిబిషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న బూర్ల రామాంజనేయులు, గీతా మాధురి తదితరులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక ఏసీ కళాశాలలో జరుగుతున్న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రదర్శనలో ఎలక్ట్రానిక్, క్రీడలు, వస్త్ర, ఆయుర్వేద, ప్రకృతి సాగు ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు తదితర స్టాల్స్‌ను పరిశీలించి, ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రం 8వేల కోట్లు ఆదాయం కోల్పోతుందని వివరించారు. పేద ప్రజల పొదుపు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంస్కరణలకు ఆమోదం తెలిపారన్నారు. పన్నులు తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజులు సదస్సులు, ర్యాలీలు ఎగ్జిబిషన్ ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడంతో ఎగుమతి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురి, సహాయ కమిషనర్ అనసూయ, అధికారులు, వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన అవసరం

● డీవైఈవో ఏసురత్నం



బహుమతులు సాధించిన విద్యార్థులతో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా తదితరులు

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్వాంటం వ్యాలీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డీవైఈవో ఏసురత్నం సూచించారు. శుక్రవారం పరీక్ష భవన్లో క్వాంటం వ్యాలీపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మొ దటి స్థానంలో కాకుమాను మండలం చినలింగాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని బ్లెస్సీ, ద్వితీయ స్థానంలో తాడికొండ మండలం కంతేరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.మోక్ష, తృతీయ స్థానంలో చేబ్రోలు మండలం నారాకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస దివ్య విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మేరా, ఎంఈవో హవేల పాల్గొన్నారు.

● కాకుమాను మండలపరిధిలోని చిన్న లింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బ్లెస్సీని ఎంఈవో -2 కొల్లి విజయ్‌భాస్కరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బెజ్జం అశోక్



ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి యూనిట్ కమిటీ సభ్యులు

తాడికొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బెజ్జం అశోక్, అబ్దుల్ కరీం ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తాడికొండ రూరల్ హెల్త్ సెంటర్లో తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు, ఫిరంగిపురం నాలుగు మండలాలకు కలిపి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బి.కృష్ణకిషోర్, సహాయ ఎన్నికల అధికారి కె.శేషగిరి రాజు నామినేషన్లు తీసుకున్నారు. ఈ ఎన్నికకు 16 మంది సభ్యుల కార్యవర్గానికి 16 మంది మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల పరిశీలకుడిగా కే విజయ్‌బాబు వ్యవహరించారు. అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బి.అశోక్‌కుమార్, సహ అధ్యక్షుడిగా కె.రవిబాబు, ఉపాధ్యక్షుడిగా షేక్ సుభాని, ఏ.లలితకుమారి, ఈ.చంద్రబాబు, పి.మల్లికార్జునరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా సీహెచ్ శారదాదేవి, కార్యదర్శిగా షేక్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా వి.రామాంజనేయులు, డి.అరుణకుమార్, బి.రాంబాబు, పి.అంకమ్మరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎం.నాగమణి, కోశాధికారిగా ఏ.పూర్ణయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్ ఏసునాధరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఏపీ ఎన్జీజీవో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు డీడీ నాయక్, ఎస్.వెంకటరెడ్డి సత్తెనపల్లి అధ్యక్షుడు మణిరావు, అమరావతి యూనిట్ మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

దాసరి వీరయ్య దురాగతాలకు అంతే లేదు

● వైసీపీ హయాంలో దళితులపై దమనకాండ ● టీడీపీ ఎస్సీ సెల్ నేతల ధ్వజం



మాట్లాడుతున్న టీడీపీ దళిత నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మంగళగిరి నియోజకవర్గంలో దాసరి వీరయ్య దురాగతాలు, దందాలు, హత్యలకు అంతే లేదని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు పేర్కొన్నారు. దాసరి వీరయ్య అరెస్టు విషయంలో వైసీపీ నేతల వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి మాట్లాడారు. మేకతోటి అరుణకు దళితులు ఇప్పుడు గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. వీరయ్య ఇతరులను హత్య చేసినప్పుడు, తమ కళ్లముందే రాళ్ల దాడికి పాల్పడినప్పుడు దళితులు గుర్తుకురాలేదా అని నిలదీశారు. ప్రశాంతంగా ఉండే దుగ్గిరాలలో కూడా హత్యా రాజకీయాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలను సమాజం ఉపేక్షించదని, హత్య కేసులో అరెస్టయిన వీరయ్య అంశాన్ని కులాలకు ఆపాదించవద్దని సూచించారు. గతంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న దాసరి వీరయ్య.. టీడీపీ బీసీ నేత నందం అబద్దయ్యకు ఫోన్ చేసి చంపుతానని బెదిరించి, అసభ్యకరంగా దూషించారన్నారు. కొదమల సురేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని వైసీపీ జడ్పీటీసీ మేకతోట అరుణ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ఏనాడూ కక్షా రాజకీయాలకు పాల్పడలేదని, ఈ విషయం ప్రజలు గమనించారు కాబట్టే భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. వైసీపీ హయాంలో పది మంది దళితులను మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి మూడు రోజులపాటు నోట్లో గుడ్డలు కుక్కి థర్డ్ డిగ్రీ ప్రయోగించి ప్రత్యక్ష నరకం చూపించారన్నారు. మంగళగిరి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి జ్యోతిబసు, ఎంపీటీసీ మధుబాబు, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ హరిదాసు, దుగ్గిరాల తెలుగుయువత అధ్యక్షుడు మహేష్‌బాబు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ నేతల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

తాడేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్‌పాల్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నేతలు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌పాల్ మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి దేశ న్యాయవ్యవస్థ మీద, ప్రజాస్వామిక స్ఫూర్తి మీద అన్నింటి కన్నా ప్రధానంగా రాజ్యాంగంపై జరిగిన దాడిగా దేశప్రజలు భావించాలని చెప్పారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్ష పడేలా చూడాలని, గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిటి రిజ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు అద్దేపల్లి నాగేశ్వరరావు, మహిళా ప్రధాన కార్యదర్శి జి.నాగేంద్రమాదిగ, మంగళగిరి మండల అధ్యక్షుడు కుమార్, వడ్డేశ్వరం పున్నయ్య, నవీన్, ఇస్సాక్, కలకోటి రాజేష్, ఎడ్లూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల: జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ప్రజాస్వామ్యంపైన, న్యాయవ్యవస్థపైన దాడిగా భావిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కలకోటి నాగేశ్వరరావు మాదిగ అన్నారు. చీఫ్‌జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దుగ్గిరాలలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిపిన నిరసన ప్రదర్శనలో ఎమ్మార్పీఎస్ నాయకులు నతానియేలు మాదిగ, నల్లూరి రవికిరణ్‌మాదిగ, ఏసుపోగు శ్యామల మాదిగ, కట్టెపోగు అరుణమాదిగ, భాస్కర్‌మాదిగ, బుజ్జిమాదిగ వీరయ్యమాదిగ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందించారు.

● పెదనందిపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని అవమానపరిచే ప్రయత్నమే ఈదాడి అని, ఇది కుట్రపూరితంగా జరిగిందని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ హేనాప్రియకు వినతిపత్రం అందజేశారు.

రాజధాని మహిళలకు అద్భుత అవకాశం

● ఔత్సాహికులకు వ్యాపార రంగాలపై శిక్షణ
● నిరుద్యోగ యువతకు సాంకేతికత, నైపుణ్యాల పెంపు..

గుంటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని యర్రబాలెం గ్రామంలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో మహిళల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈడీపీ) ప్రారంభమైంది. ఈ నెల 16న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మహిళల స్వయం ఉపాధి, సాధికారత పెంపొందించడం కోసం 26 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్(జీఎఫ్‌డీ) సంస్థ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఈడీఐఐ- అహ్మదాబాద్), యాక్సెంచర్ సంస్థలతో కలిసి అమరావతిలో అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాజధాని ప్రాంత మహిళలు, నిరుద్యోగ యువతకు వ్యాపార నిర్వహణకు అవసరమైన సాంకేతిక, ఆచరణాత్మక నైపుణ్యాలను అందిస్తారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు సహకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు మందడం, తుళ్లూరు మండలంలోని అనంతవరం, తాడేపల్లి మండలంలోని ఉండవల్లి రూరల్, మంగళగిరి మండలంలోని యర్రబాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అనంతవరం, ఉండవల్లి, యర్రబాలెం గ్రామాల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రతి బ్యాచ్‌లో 26 రోజులపాటు బిస్కెట్లు, స్నాక్స్, సాంప్రదాయ స్వీట్స్, టిఫిన్ పదార్థాలు, మిల్లెట్ ఆధారిత పోషకాహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ అందించనున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు పాల్గొనే అవకాశం కల్పించారు. స్వయం ఉపాధి పొందేందుకు మహిళలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీఐఐ అహ్మదాబాద్ ప్రాజెక్టు అధికారి ఎడ్మండ్ భూపతి, జీఎఫ్‌డీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మాధవీలత, ప్రాజెక్టు మేనేజర్ రుబిందర్ కౌర్, మాస్టర్ ట్రైనర్ సురేంద్రకుమార్, సీఆర్డీఏ లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్ ఎస్.వి. నరసింహం, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాల వివరాల కోసం లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్ ఎస్.వి. నరసింహం 95503 11637, జీఎఫ్‌డీ ప్రాజెక్ట్ మేనేజర్ రబిందర్ కౌర్ 9618374402లను సంప్రదించవచ్చని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వేములూరిపాడు జడ్పీహెచ్‌ఎం సాంబయ్య

ఫిరంగిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో శనివారం జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వేములూరిపాడు విద్యార్థులు ఎంపికయ్యారని జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ హెచ్‌ఎం సాంబయ్య శుక్రవారం తెలిపారు. ఉమారవళి, లోకేశ్, మనోహర్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వగ జిల్లా స్థాయి టీమ్ ఈవెంట్లలో ఏడుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో మెడల్స్ కైవసం చేసుకున్నారన్నారు. ఫెన్సింగ్ ఆటలో విద్యార్థుల గెలుపునకు కృషి చేసిన పీడీ సుజాత, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఏపీ ఎంఈఎస్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అలీ



అజ్గర్ అలీ



అబ్దుల్ గని

మంగళగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ సమావేశం గురువారం సాయంత్రం మంగళగిరిలో జరిగింది. అసోసియేషన్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెల్లూరు ఆర్అండ్‌బీ సర్కిల్ సూపరింటెండెంట్ షేక్ అలీ అజ్గర్, చిత్తూరు జిల్లా వి.కోట జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ గని నియమితులయ్యారు. వీరికి ఏపీ ఎంఈఎస్ఏ అధ్యక్షుడు ఎస్ దాదా బాషా నియామకపత్రాలను అందజేశారు.

మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టండి

పెదనందిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నపర్రు రోడ్డు వెంట ఉన్న సైడు కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి మురుగునీరు పారుదల లేక పంటలు నీట మునుగుతున్నాయని, వెంటనే మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామ కార్యదర్శి నాగయ్యకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కూడా కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు పారుదల లేక దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని దోమల నివారణకు మందు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రామినేని శ్రీనివాసరావు, కందు శ్రీకాంత్, చెన్నుపాటి సురేంద్ర, వెంకటప్పయ్య, గంగాధర్, నాని, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో పేదలకు ఊతం : ఎంపీడీవో

పెదనందిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు కలుగుతుందని ఎంపీడీవో స్వామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు స్థానిక సుస్థిరాభివృద్ధిపై థీమ్ 5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్ఎస్ మార్ట్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు గోపీ, ఏపీఎం సుబ్బారావు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి : తహసీల్దార్

వట్టిచెరుకూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు కాంప్లెక్స్ ఎరువు, యూరియా అందుబాటులో ఉండటం లేదని పలు ప్రాంతాల నుంచి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ క్షమారాణి శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఇప్పటివరకు పీఏసీఎస్, జీడీసీఎంఎస్, రైతు సేవాకేంద్రాల ద్వారా రైతులకు అందించిన ఎరువుల వివరాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ముందస్తుగా ఎరువులను సిద్ధం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

● గ్రీవెన్స్ డేలో ఏడీసీ భార్గవతేజ



వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ భార్గవ తేజ

తుళ్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని సీఆర్డీఏ అడిషినల్ కమిషనర్ ఏ భార్గవతేజ చెప్పారు. రాజధాని రైతుల, రైతుకూలీల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వార్షిక కౌలు చెల్లింపు, గ్రామకంఠం సమస్యలు, రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంత వాసులు తమ అర్జీలను ఆయనకు అందజేశారు. అర్జీదారులు అందజేసిన సమస్యలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని అర్జీదారులకు తెలియజేశారు. ఏపీ సీఆర్డీఏ లోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియ జేసిన పలు ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేలో 39 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిడ్రెస్సల్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారి పీ జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, పీ పద్మావతి, ఏజీ చిన్ని కృష్ణ, జీ రవీందర్, బీ సాయి శ్రీనివాస్ నాయక్, బొర్రా శ్రీనివాసరావు, ఎస్ రవీంద్రప్రసాద్, సీహెచ్ మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన రోటరీ కృత్రిమ చేతుల పంపిణీ



మంగళకరము ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రెగడ రాజశేఖర్

మంగళగిరి సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళకరము పేరిట నాలుగు రోజులుగా జరుగుతున్న కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముగింపు సభకు మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ చేతులు లేని దివ్యాంగులకు రోటరీ ఆధ్వర్యంలో జర్మన్ టెక్నాలజీతో కృత్రిమ చేతులను పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో రోటరీ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. రోటరీ పీడీజీ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మంగళగిరి రోటరీ ఆధ్వర్యంలో ఈ దఫా 160 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతులు అమర్చారన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈ.పూర్ణచంద్, మంగళగిరి కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, పూర్వ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, అందె రేవంత్‌కుమార్, మురళీమోహనరావు, వడ్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు : జేసీ శ్రీవాస్తవ



పల్లపాడులో ఎరువుల గురించి రైతులతో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్తవ, పక్కన ఆర్డీవో

వట్టిచెరుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రబీలో వేసే మిర్చి, ఇతర అపరాల పైర్లతో పాటు మొక్కజొన్న విత్తుకొనేందుకు వాతావరణం అనుకూలంగా ఉన్నందున దుక్కి దశలో వేసుకొనేందుకు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు, యూరియా సకాలంలో పంపిణీ చేయాలని పల్లపాడు రైతుల విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు జేసీ శ్రీవాస్తవ, ఆర్డీవో శ్రీనివాసరావులు తహసీల్దార్ క్షమారాణి, ఏవో చందోలు సునీతతో కలసి మండలం లోని పల్లపాడు గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ వేసిన వరిసాగు చివరి దశలో వినియోగించుకొనేందుకు స్థానిక పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామని ఏవో సునీత వివరించారు. ఎరువుల కొరత లేదని, రైతులకు అవసరమైన కాంప్లెక్స్ యూరియా ఎరువులను పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా, జీడీసీఎంఎస్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

ఎన్నికల నాటి హామీలను అమలు చేయాలి

● సీపీఎం నేత బాబూరావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా మంత్రి లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలకు సంబంధించి దరఖాస్తుదారులతో కలిసి శుక్రవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ అధ్యక్షతన జరిగిన సభలో బాబూరావు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ప్రైవేటు యూనివర్సిటీలకు వందలాది ఎకరాలను దారాదత్తం చేస్తున్నారని, పేదలకు మాత్రం ఇళ్ల స్థలాలు ఇవ్వడంలేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణం నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఎం నేతలు డి.శ్రీనివాసకుమారి, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవం



గెలుపొందిన క్రీడాకారులతో అన్నాంబ సంస్థల అధినేత అంథోనమ్మ

ఫిరంగిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాల 75వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పునీత అన్నాంబ సంస్థల అధినేత సిస్టర్ పీ అంతోనమ్మ పాల్గొన్నారు. దైవేచ్ఛతోనే పునీత అన్నాంబ ఈ పాఠశాలను స్థాపించారన్నారు. పేద బాలికలకు విద్యను అందించే ఈ పాఠశాల మరో చరిత్రను రాయాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో క్రమశిక్షణ, క్రీడలు, విద్యాభివృద్ధిలో ముందుండేలా కృషి చేయాలన్నారు. డీవైఈవో ఏసురత్నం మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ పాఠశాల విద్యార్థులు విద్య, క్రీడల్లో ముందుండటం అభినందనీయమన్నారు. సభకు ముందుగా బాలఏసు చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి సమిష్టి దివ్య పూజా బలిని సమర్పించారు. సభలో సెయింట్ ఆన్స్ బాలికలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, ఎంఈవోలు షేక్ మహబూబ్ సుభానీ, సీహెచ్ రవికాంత్, హెచ్‌ఎం వీ తేరేసమ్మ, గురువులు, కన్యాస్త్రీలు, గ్రామ పెద్దలు, వందలాది మంది ప్రజలు హాజరయ్యారు.

23వరకు లేఅవుట్ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లేఅవుట్లు, ప్లాట్‌ల క్రమబద్ధీకరణ గడువు ఈ నెల 23 వరకు మాత్రమే ఉందని కమిషనర్ అప్పలనాయుడు తెలిపారు. 30 జూన్ 2025 ముందు వేసిన అనధికార లేఅవుట్లు ప్లాట్లను 14శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేకుంటే ఆ ప్లాట్లలో భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వరని, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కొనుగోలు, అమ్మకాలలో కూడా రిజిస్ట్రేషన్లు జరగవని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పట్టణంలో 60గజాల స్థలం ఉన్న యజమానులు ఒక్క రూపాయి చెల్లించి భవన నిర్మాణం అనుమతులు పొందవచ్చన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

జేఎంజే కళాశాలలో వైద్య శిబిరం

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జేఎంజే మహిళ కళాశాలలో శుక్రవారం వైద్య అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడ మణిపాల్ హాస్పటల్ వైద్యులు ఎం.దివ్య పలు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, అవి లోపిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో వివరించారు. ప్రిన్సిపాల్ శాంత, రోజ్‌లీన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

23న చిన్న పిల్లల గుండె వైద్య శిబిరం

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 23న చిన్న పిల్లల గుండె వైద్య శిబిరం జరుగుతుందని డాక్టర్ మధుబాబు తెలిపారు. రమేష్ హాస్పటల్స్‌కు చెందిన వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు పరిశీలన

తెనాలి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 37వ వార్డులో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. వార్డులో ప్రజలను కలిసి మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆరా తీశారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాల్వల్లో వ్యర్థాలులేకుండా చూడాలన్నారు. హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు, టిపివో సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు కొన్ని వార్డులలో తాగునీటి సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ రిజర్వాయర్ పైపులైను మరమ్మతులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ వార్డు నుంచి 11వ వార్డు వరకు నీటి సరఫరా శనివారం నిలిపివేయబడుతుందని, ప్రజలు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

● సీఐ సాంబశివరావు

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బంగారు నగలు ధరించి ఒంటరిగా వివిధ కార్యక్రమాలకు వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు కోరారు. ఇటీవల కాలంలో తెనాలి, గుంటూరులలో ఒకే మోస్తరు గొలుసు దొంగతనాలు చోటు చేసుకున్నాయన్నారు. నేరగాళ్లు ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసుకుని ఆయా ప్రాంతాలలో రెక్కీ నిర్వహించి ద్విచక్ర వాహనాలపై వచ్చి గొలుసుల దొంగతనానికి పాల్పడుతున్నారన్నారు. ఒంటరిగా నడిచివెళ్లే మహిళలు తమ మెడలోని బంగారు గొలుసు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు.

సచివాలయానికి బీరువా వితరణ

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగం జాగర్లమూడి గ్రామ సచివాలయానికి గ్రామస్థుడు యార్లగడ్డ సీతారామయ్య, అరుణకుమారిలు ఇనుప బీరువానుబహూకరించారు. కార్యక్రమంలో కొత్త రమేష్‌బాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గ్యార్మీ ప్రార్థనలు

పొన్నూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని గ్యార్మీ పండుగ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. పట్టణంలోని బాపట్ల బస్టాండ్ వద్ద ఉన్న కార్ స్టాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యార్మీ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు, ముస్లిం మైనార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమర్థత నిరూపించుకున్న లోకేశ్

● ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి

పొన్నూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టెక్ దిగ్గజం గూగుల్‌ను వైజాగ్ తీసుకురావడంలోనే మంత్రి నారా లోకేశ్ సమర్థత నిరూపించుకున్నారని క్రైస్తవ సంఘాల నాయకుడు ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి శుక్రవారం అన్నారు. విద్యావంతుడు మంత్రి నారా లోకేశ్ సామర్థ్యం మరోసారి నిరూపితమైందన్నారు. కొత్తతరం నాయకుడు కావడంతోనే టెక్నాలజీని అందిపుచ్చుకొని బుల్లెట్ స్పీడ్‌తో లోకేశ్ దూసుకుపోతున్నారని కొనియాడారు. ప్రధానమంత్రి దేశ నాయకులతో కో ఆర్డినేట్ చేసుకుంటూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో లోకేశ్ నడిపిస్తున్నారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి

● మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బంగారు నగల విక్రయ సంస్థ జోస్ అలుక్కాస్ సహకారంతో శుక్రవారం పాఠశాలలకు సాయం అందజేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సంస్థ పట్టణంలోని ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్ బల్లలు, విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, మౌలిక వసతుల సామగ్రి అందజేసేందుకు ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తోడ్పాటుకు దాతలు కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి పౌరులు కావాలని తల్లిదండ్రులు తమ మీద పెట్టుకున్న ఆశలను వమ్ము చేయవద్దని చెప్పారు. కమిషనర్ అప్పలనాయుడు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, సంస్థ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పాఠశాలలకు సాయం అందజేస్తున్నమంత్రి మనోహర్

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే వైద్యులు, సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హెచ్చరించారు. పొన్నూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాస్పటల్‌కు వచ్చిన సమయంలో వైద్యులు లేకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించారు. ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెగ్యులర్ వైద్యులు లేకపోవడం వల్ల డిప్యుటేషన్‌పై మూడు రోజులు మాత్రమే వైద్యులు వస్తున్నారని సిబ్బంది చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే హాస్పిటల్‌కు ప్రతిరోజు వచ్చే రోగులు వివరాలను, రికార్డులను తనిఖీ చేశారు. హాస్పటల్లో రోగులకు అందించే వైద్య సేవలు, నిర్వహించే పరీక్షలు గురించి రికార్డులను తనిఖీచేసి ఆన్‌లైన్‌లో వివరాలను సరిపోల్చి చూసుకున్నారు. అలాగే హాస్పటల్‌లోని ఫార్మసీని పరిశీలించి కాలంచెల్లిన మందులను తొలగించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే హాస్పటల్‌లోని పలు విభాగాలను పరిశీలించి సంపూర్ణ పారిశుధ్య అమలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు అందించే వైద్యం విషయంలో అలసత్వం వహించవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ఆసుపత్రిలో సమయపాలన పాటించాలని రోగులతో దయతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయంతో అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు పనిచేస్తుందన్నారు. కానీ ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చేలా వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తే సహించేది లేదని పలుమార్లు హెచ్చరికలు జారీచేశారు. తనిఖీలలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్నుపాటి భాస్కర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

ఆలయాల పవిత్రతను కాపాడాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల



ప్రమాణ స్వీకారం చేస్తున్న సహస్రలింగేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యులు

పొన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి సంప్రదాయాలకు నిలయమైన ఆలయాల పవిత్రతను కాపాడేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి, శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆలయాలను రాజకీయాలకు వేదికగా మార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఆలయాలను కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించేలా ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. అయితే ఆలయాల అభివృద్ధికి పాలకమండలి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో మంటగలిసిన ఆలయాల పవిత్రతను కాపాడేందుకు పాలకమండలి అనేక సంస్కరణలతో పాలన సాగించాలని సూచించారు. 1960 ప్రాంతంలో సహస్రలింగేశ్వరస్వామి, శ్రీవీరాంజనేయస్వామి, శ్రీగరుత్మంతస్వామి, శ్రీకాలభైరవస్వామి, శ్రీదశావతారాల ఆలయాలు నిర్మాణానికి జగన్నాథస్వామి ఎంతో కృషి చేశారన్నారు. జగన్నాథస్వామి కృషితో పొన్నూరు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోందని కొనియాడారు. అయితే వారి ఆశయాలు వారి ఆలోచనలకు అనుగుణంగా పాలకవర్గాలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పూజారులు కూడా దేవుడి సేవలో తరించాలని సూచించారు. అలాగే ఆలయాలకు ఎవరైనా భక్తులు దానాలు సమర్పించిన స్వామి వారి సేవలకు నగదు సమర్పించిన తప్పనిసరిగా రసీదు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, ఆలయ ఈవో గద్దె వెంకట అమర్నాథ్, పాలకమండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా, పాలకవర్గ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై చెప్పు విసిరిన న్యాయవాదిని శిక్షించాలి

● తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై చెప్పు విసిరిన న్యాయవాదిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేసిన అనంతరం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆలపాటి కరుణ మాట్లాడుతూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా జరిగిన దాడిని ఖండించారు. ఈ నిరసన కార్యక్రమంలో సుద్దపల్లి మురళీధర్, పవన్, చిన్న వెంకటేష్, కోటేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మార్పీస్ జిల్లా యువసేన నాయకుడు అత్తోట రవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోట, సిరిపురం, చివలూరు, తూములూరు తదితర గ్రామాల్లో సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడి చేయడంపై ఎమ్మార్పీస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయం అవరణలో ఎమ్మార్పీస్ నాయకులు దాడి చేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ గవాయ్ దళితుడు కావడం వలనే ఈ దాడి జరిగిందన్నారు. దాడిచేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మార్పీస్ నాయకులు తహసీల్దార్ సిద్ధార్థకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొండమూడి బోసు, మల్లమాటి జయరావు, అత్తోట సుధీర్, అత్తోట రాంబాబు, మల్లిక, తాడికొండ వరప్రసాద్, సాపాటి చిట్టి, కొల్లిపర జయరావు, వంశీ పాల్గొన్నారు

చేబ్రోలులో..

చేబ్రోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని చట్టాలు దళితులకు ఉపయోగపడకపోతే అవి ఎవరికోసం ఉన్నాయంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశ్నించారు. చేబ్రోలు మండల ప్రధాన కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడి చేసిన వ్యక్తిపై సుమోటోగా కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దారు బి.శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరావులకు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజుమాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నామన్నారు. సమస్య పరిష్కారం వైపు ప్రభుత్వం ముందుకు రాకపోతే దేశ వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.పోలరాజు, కారుమూరి ఆదం మాదిగ, కె.సెల్వమణి, కె.నవమణి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు



కొల్లిపరలో తహసీల్దార్ సిద్ధార్థకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు



వ్యాయమ ఉపాధ్యాయులతో విద్యార్థినీ, విద్యార్థులు

వాలీబాల్‌లో వేజెండ్ల విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ వాలీబాల్ జట్ల ఎంపికలో వేజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఎంపికలో మొగల్ ఆసిఫ్, యంపరాల భవానీ, షేక్ ఖాదర్ మున్నిలు ఎంపికయ్యారు. వీరు అక్టోబరు 28 నుంచి 30వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలలో పాల్గొంటారు. విద్యార్థులకు శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, దాసరి విజయదుర్గ, మరక రాజ్యలక్ష్మిలను ప్రధానోపాధ్యాయురాలు కొల్లి గౌరేశ్వరీదేవి, ఉపాధ్యాయ బృందం, పాఠశాల పీఎంసీ చైర్మన్ పఠాన్ రబియా, గ్రామ పెద్దలు అభినందించారు.

క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన అవసరం

● డీవైఈవో ఏసురత్నం

గుంటూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): క్వాంటం వ్యాలీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డీవైఈవో ఏసురత్నం సూచించారు. శుక్రవారం పరీక్ష భవన్లో క్వాంటం వ్యాలీపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో కాకుమాను మండలం చినలింగాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని బ్లెస్సీ, ద్వితీయ స్థానంలో తాడికొండ మండలం కంతేరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.మోక్ష, తృతీయ స్థానంలో చేబ్రోలు మండలం నారాకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస దివ్య విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మేరా, ఎంఈవో హవేల పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడటాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై జరిగిన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, మొక్కలు పెంపకం, పర్యావరణ అనుకూల ఆవిష్కరణల వంటి వాటిపై దృష్టి పెట్టడం వలన గ్రామాలు మరింత అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దటానికి ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి శరణు కిషోర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

చేబ్రోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరులో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఏఆర్డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేతులు కడుక్కునే ఏడు దశల విధానాన్ని నేర్చుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు డీవీ శ్రీనివాస్ చేతులు కడుక్కునే విధానం, పరిశుభ్రత అలవాట్లు పాటించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు డేటాల్ బానేగా స్వస్థ్ ఇండియా ప్రతినిధులు జి.నళిని, బ్రహ్మం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.జగదీష్, పి.అనలకుమారి, డీవీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● కమిషనర్ అప్పలనాయుడు



పారిశుధ్య సిబ్బంది మస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు హెచ్చరించారు. పట్టణంలోని పలు వార్డులలో పారిశుధ్యాన్ని శుక్రవారం వేకువజామున పర్యటించి పరిశీలించారు. 1వ డివిజన్ మస్టర్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ చేశారు. పారిశుధ్యంపై కార్యదర్శులు, నగర దీపికలు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. 2వ డివిజన్‌లో కూడా జరుగుతున్న పారిశుధ్య పనులను కేటాయించిన సిబ్బందిని పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. పలు చోట్ల గృహిణులకు వ్యర్థాల నుంచి హోంకంపోస్టు చేసే విధానాన్ని వివరించే కార్యక్రమంలో పాల్గొని సూచనలు ఇచ్చారు.



లీగల్ సెల్ కార్యవర్గంతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ కమిటీని శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, న్యాయవాదులు గత ప్రభుత్వ వైఫల్యాలను గుర్తించి కూటమి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. అభివృద్ధితో పాటు రాష్ట్రంలో ప్రజలకు పథకాలు కూడా అందుతున్నాయని చెప్పారు. లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఇందుపల్లి రాజారామ్, ఉపాధ్యక్షుడిగా నన్నపనేని మాధవరావు, గడ్డిపాటి రాంబాబు, వల్లభనేని లలితకుమారి, ప్రధాన కార్యదర్శిగా తాడిశెట్టి వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధులుగా మల్లెపెద్ది రవికుమార్, కంచర్ల విజయభాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా చదలవాడ శ్రీనాథ్, ఉమామహేశ్వరరావు, శ్రీహరిప్రసాద్, శ్రీనివాసరావు, రవికుమార్, కార్యదర్శులుగా కిషోర్, ప్రదీప్, ప్రపూర్ణ, శ్రీలక్ష్మి, హరీష్, కొండయ్యలను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

తెనాలి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తించే వ్యాధి లక్షణాలు వివరిస్తూ నందులపేట ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ప్లకార్డులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన కేంద్రాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తించేందుకు అవసరమైన అంశాలను వివరించారు. 1985 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు నెలను పింక్ మాసంగా ప్రభుత్వం ప్రకటించిందని, క్యాన్సర్ రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అరుణకుమారి, అనీల్‌కుమార్, బాలచంద్రమౌళి, ఉమాకాంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ప్రజా నాట్య మండలి కళాకారులకు ఘన నివాళి

తెనాలి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా నాట్యమండలి కళాకారులు, సంగీత దర్శకులు తాతినేని చలపతిరావు, మోహన్‌దాస్, గోపాలం సంస్మరణ కార్యక్రమం శుక్రవారం ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు ముక్కాల మాణిక్యరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాటిక, నాటక, బుర్రకథ కళారూపాలను బృందాల ద్వారా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రదర్శించేందుకు కృషి చేశారని చెప్పారు. మహాభూమి, పరివర్తన, భయం, అపనింద నాటకాలను జనరంజకంగా ప్రదర్శించి తెలుగునాట విప్లవం సృష్టించారని తెలిపారు. వందలాది సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారని, పార్టీ నిషేధ సమయంలో సినీరంగ ప్రవేశం చేశారని, 125చిత్రాలకు సంగీతం సమకూర్చి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారని చెప్పారు. నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, బెల్లంకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అనురాధ, మౌనిక పలు గీతాలు ఆలపించారు.